

నేటి నుంచి సంక్రాంతి ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్, జనవరి 6: సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆదివారం నుంచి అనకాపల్లి, నర్సీపట్నం పీటీడీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు డీపీటీవో కె.పద్మావతి తెలిపారు. అనకాపల్లి డిపో నుంచి ప్రతి రోజు రాజమండ్రికి మూడు, పలాసకు మూడు, విశాఖపట్నానికి ఐదు, పాయకరావుపేటకు నాలుగు సర్వీసులు అదనంగా నడపనున్నామన్నారు. అలాగే నర్సీపట్నం డిపో నుంచి రోజూ విజయవాడకు మూడు, హైదరాబాద్‌కు రెండు, విశాఖపట్నానికి ఆరు, తునికి నాలుగు సర్వీసులు అదనంగా నడపనున్నామని తెలిపారు.

ఎస్మాపై అంగన్‌వాడీలు భగ్గు

నెహ్రూచౌక్‌లో ఆందోళన
జీవో కాపీలు దహనం

- కలెక్టరేట్ ఎదుట 24 గంటల నిరాహార దీక్ష ప్రారంభం
- చలిని సైతం లెక్కచేయకుండా శిబిరంలోనే నిద్రించిన కార్యకర్తలు



నెహ్రూచౌక్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం



జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి టౌన్, జనవరి 6: అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ జీవో నంబరు- 2 ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. జీవోను నిరసిస్తూ శనివారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఎంత నిర్బంధాన్నైనా ఎదుర్కొంటామని, తమ న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను విడిచిపెట్టేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేయడంతో పాటు జీవో నంబరు- 2 కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మె పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ఉద్యమంపై నిర్బంధాన్ని ప్రయోగిస్తే మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఎస్మా జీవోను రద్దు చేయాలని, అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు తనూజ, కాసులమ్మ, కృష్ణవేణి, ఉమా నారాయణమ్మ, సీఐటీయూ నాయకులు గంటా శ్రీరామ్, డి. శ్రీను, డి.వరలక్ష్మి, ఎం.అప్పలరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగించడం దారుణమని, తక్షణమే వారి సమస్యలు పరిష్కరించి ఎస్మా జీవోను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. లోకనాథం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట 24 గంటల దీక్ష

అనకాపల్లి కలెక్టరేట్: జిల్లాలోని అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మె శనివారానికి 26వ రోజుకు చేరింది. అంగన్‌వాడీల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 24 గంటల దీక్షను శంకరంలోని కలెక్టరేట్ వద్ద ప్రారంభించారు. సబ్బవరం ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు సుమారు 20 మంది నిరాహార దీక్ష చేపట్టగా, మరో 80 మంది అంగన్‌వాడీలు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట చలిని సైతం లెక్క చేయకుండా నిద్రిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు దేవి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మిన్నంటిన నిరసనలు

బుచ్చెయ్యపేటలో అంగన్‌వాడీలు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎస్మా ప్రయోగిస్తూ జారీ చేసిన జీవో నంబరు-2 కాపీలను దహనం చేశారు. మాడుగులలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. గొలుగొండలో అంగన్‌వాడీలు ధర్నా చేశారు. నర్సీపట్నంలో అంగన్‌వాడీలు శనివారం గంగిరెద్దుకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. మునగపాక మెయిన్‌రోడ్డుపై అంగన్‌వాడీలు మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు.



కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరంలో శనివారం రాత్రి నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

ఆది నుంచీ అవమానాలే

ఏయూలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.సమతకు దక్కని కనీస గౌరవం

- ఉద్దేశపూర్వకంగా కొంతమంది నిర్లక్ష్యం
- చార్జ్ తీసుకునేందుకు ఛాంబర్‌కు వెళ్లకుండా అడ్డగింత
- మూడు రోజుల వరకూ వాహనం కూడా ఇవ్వని వైనం
- వైస్ చాన్సలర్‌కు చెప్పకుండానే కీలక నిర్ణయాలు
- యూనిఫెస్ట్ నిర్వహణకు సంబంధించిన సమాచారం నిల్
- వాట్సాప్‌లో ఆహ్వానం
- కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా?... అంటూ ప్రశ్నించిన ఇన్‌చార్జి వీసీ
- నోరు తెరిస్తే వర్సిటీ పరువు బజారున పడుతుందని బాధను దిగమింగుకుంటున్నారంటున్న సన్నిహితులు



ప్రొఫెసర్ కె.సమత



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.సమతకు క్యాంపస్‌లో కొందరు కనీస గౌరవం ఇవ్వడం లేదు. ఏ విషయం ఆమె దృష్టికి తీసుకువెళ్లడం లేదు. ప్రస్తుతం వర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న యూత్ ఫెస్టివల్‌కు సంబంధించిన సమాచారం కూడా ఆమె అడిగేంత వరకూ చెప్పలేదు. ప్రారంభోత్సవానికి ఆహ్వానం కూడా కేవలం వాట్సాప్‌లో పంపి ఊరుకున్నారు. ఈ పరిణామాలపై ఆమె మనస్తాపంతో ఉన్నట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితిని తాను మున్నెన్నడూ చూడలేదని, వర్సిటీ పరువు పోతుందనే ఉద్దేశంతోనే సైలెంట్‌గా ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ప్రొఫెసర్ కె.సమత నవంబరు నెలాఖరులో ఏయూ ఇన్‌చార్జి వీసీగా నియమితులయ్యారు. సీనియర్ ప్రొఫెసర్ అయిన ఆమె అప్పటికి రెక్టార్‌గా ఉన్నారు. వర్సిటీలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆమె పట్ల అధికారులు, అధ్యాపకులు గౌరవ భావంతో వ్యవహరించాలి. కానీ, మాజీ వీసీకి సన్నిహితంగా మెలిగిన కొందరు ఆమెను కనీసం వీసీగా గుర్తించేందుకు అంగీకరించలేదు. చార్జ్ తీసుకునేందుకు వైస్ చాన్సలర్ ఛాంబర్‌లోకి కూడా అడుగు పెట్టనివ్వలేదు. ఈ విషయమై మీడియాలో కథనాలు రావడంతో ఉలిక్కిపడిన అధికారులు తరువాత రోజు ఆమెను వీసీ చాంబర్‌కు తీసుకువెళ్లి సీటులో కూర్చోబెట్టారు. ఇలా తొలిరోజే వివక్ష ఎదుర్కొన్నందుకు ఆమె బాధపడ్డారు. ఆ తరువాత కూడా మూడు రోజులపాటు వీసీ వాహనాన్ని ఆమెకు కేటాయించకుండా చేశారు. దీనిపై రచ్చ జరుగుతుందన్న ఉద్దేశంతో తరువాత అప్పగించారు. అయితే, కీలక నిర్ణయాలు, ఇతర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం ఆమెకు తెలియనివ్వడం లేదు. ఈ విషయమై అనేకమార్లు సన్నిహితుల వద్ద ఇన్‌చార్జి వీసీ ఆవేదన వ్యక్తం చేశారు. తన వద్దకు ఎవరూ రావడం లేదని, ఏ విషయాలు తెలియజేయడం లేదంటూ వాపోయారు. ఇక ప్రస్తుతానికి వస్తే...ఆంధ్ర యూనివర్సిటీలో శుక్రవారం నుంచి 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24 జరుగుతోంది. ఈ వేడుకల నిర్వహణకు సుమారు 40 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేసుకోగా, ఏయూకు అవకాశం దక్కింది. ఈ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు వేర్వేరు రాష్ట్రాల నుంచి 800 మంది విద్యార్థులు, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ నుంచి పరిశీలకులు హాజరయ్యారు. అంతటి కీలకమైన ఈ వేడుకలకు సబంధించిన ... మిగతా 8వ పేజీలో

నేడు 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు

- ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నిర్వహణ
- ఉదయం 10 గంటలకు ప్రారంభం



అనకాపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఏటా మాదిరిగా 'ఆంధ్రజ్యోతి ఏబీఎన్ యాజమాన్యం ఈ ఏడాది కూడా ముత్యాల ముగ్గుల పోటీ లు నిర్వహిస్తోంది. 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్...కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు...పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు...రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన' ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అనకాపల్లిలో రాజా థియేటర్ పక్కనున్న ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో జరగనున్నాయి. స్థానికంగా 'దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్-అటానమస్)' స్పాన్సర్ చేస్తోంది. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించనున్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.6 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.4 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.3 వేలు ఇవ్వనున్నారు. ఇకపోతే, పోటీలో మహిళలు మాత్రమే పోటీల్లో పాల్గొనాలి. ముగ్గు, రంగులు, పువ్వులు వగైరా సామగ్రిని పోటీదారులే తెచ్చుకోవాలి. రెండు గంటల్లోగా ముగ్గు వేయాల్సి ఉంటుంది. చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి. పోటీల్లో పాల్గొనదలచినవారు మరిన్ని వివరాలకు ఈ 9985411045 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలి. ఉదయం 9 గంటలకల్లా ప్రాంగణానికి చేరుకోవాలి. కచ్చితంగా పది గంటలకు పోటీ ప్రారంభమవుతుంది.

ఇదేం బడ్జెట్?

రాబడి, ఖర్చు అంచనాలకు పొంతన లేదు

- టీడీపీ, జనసేన కౌన్సిలర్ల ధ్వజం
- సామాజిక పింఛన్లను కూడా బడ్జెట్‌లో చూపిస్తారా? అని నిలదీసిన చింతకాయల పద్మావతి
- రోడ్డు విస్తరణకు రూ.1.5 కోట్లు సరిపోతాయా? అని నిలదీత
- వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం



టీడీపీ కౌన్సిలర్ పద్మావతి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణల మధ్య వాగ్వాదం



మాట్లాడుతున్న చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం, జనవరి 6: మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశం వాడీవేడీగా జరిగింది. శనివారం మునిసిపాలిటీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాబడి, ఖర్చు అంచనాలకు పొంతన లేదని ఆరోపిస్తూ 2024-25 బడ్జెట్‌ను టీడీపీ, జనసేన కౌన్సిలర్లు వ్యతిరేకించారు. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలో సుమారు రూ.33 కోట్లతో 2024-25 సంవత్సరం బడ్జెట్ అంచనాలను ప్రవేశ పెట్టారు. 2023-24 సవరించిన బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్ వివరాలను అకౌంటెంట్ లక్ష్మి చదివి వినిపించారు. ఈ సందర్భంగా చింతకాయల పద్మావతి మాట్లాడుతూ బడ్జెట్‌లో వృద్ధాప్య, వింతతు, దివ్యాంగుల పింఛన్ల కోసం రూ.19.72 కోట్లు ఖర్చు చూపించారని, పింఛన్లు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా?, మునిసిపాలిటీ ఇస్తుందా? స్పష్టత ఇవ్వాలని కోరారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ పింఛన్లు రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందని, మునిసిపాలిటీ కూడా ప్రభుత్వంలో భాగమే అని అన్నారు. మాస్టర్ ప్లాన్ కోసం రూ.లక్ష ఖర్చు చూపించారు, ఇప్పటి వరకు మాస్టర్ ప్లాన్ మంజూరు అయిందా?... లేదా ? అని పద్మావతి నిలదీశారు. మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2011లో కొత్తగా ఏర్పడిన 44 మునిసిపాలిటీలలో ఐఎల్‌యూపీ మాత్రమే అమలులో ఉందని, మాస్టర్ ప్లాన్ మంజూరు కాలేదని తెలిపారు. త్వరలో శాటిలైట్ సర్వే చేసి మాస్టర్ ప్లాన్ మంజూరు చేస్తారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ గ్రాంట్ రూ.70 లక్షలు వచ్చినట్టు చూపించారని, వాస్తవానికి ఈ నిధులు టీడీపీ హయాంలో మంజూరు అయ్యాయని పద్మావతి చెప్పారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క పైసా కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. రోడ్డు విస్తరణకు రూ.1.5 కోట్లు ఖర్చు చూపిస్తున్నారని, రోడ్డు విస్తరణకు ఎన్ని నిధులు మంజూరు అయ్యాయి?, నష్ట పరిహారం, డ్రైనేజీ పనులకు ఎంత ఖర్చు చేస్తున్నారో వివరించాలని ఆమె కోరారు. రోడ్డు విస్తరణకు రూ.1.5 కోట్లు సరిపోతాయా? అని ప్రశ్నించారు. దీనికి డీఈఈ నారాయణ వివరణ ఇస్తూ రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.16.60 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు రూ.3.5 కోట్లు ఖర్చు అయినట్టు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని, బడ్జెట్ రావలసి ఉందని తెలిపారు. టీడీపీ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ బడ్జెట్‌లో ట్రాక్టర్ల అద్దె చెల్లింపులు కోసం రూ.40 లక్షలు ఖర్చు చూపించారని, రూ.9 లక్షలు పెడితే కొత్త ట్రాక్టర్ వస్తుందని, ఈ ప్రయత్నం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మునిసిపాలిటీ అకౌంటెంట్ లక్ష్మి వివరణ ఇస్తూ ట్రాక్టర్ల అద్దె కోసం రూ.40 లక్షలు ఖర్చు అవుతుందని అంచనాలు మాత్రమే వేశామని తెలిపారు. 2023-24 సంవత్సరంలో 9 నెలలకు ట్రాక్టర్ల అద్దెకు రూ.8.16 లక్షలు ఖర్చు అయిందని వివరించారు. వైస్ చైర్మన్-2 తమరాన అప్పలనాయుడు మాట్లాడుతూ కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేస్తే దానికి డ్రైవరు, క్లీనరు, నిర్వహణ ఖర్చులు మునిసిపాలిటీకి అదనంగా అవుతాయని తెలిపారు. అద్దె ట్రాక్టర్ అయితే ఆ ఖర్చంతా సంబంధిత ట్రాక్టర్ యజమానే భరిస్తారని చెప్పారు. జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య మాట్లాడుతూ ప్రజారోగ్యం, ఇంజనీరింగ్ విభాగంలో ఆయిల్ ఖర్చు రూ.85 లక్షలు అంచనా ఎందుకు వేశారని, రూ.50 లక్షలు లోపే ఖర్చు అవుతుందని తెలిపారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ రూ.85 లక్షలు అవుతుందని అంచనా వేశారని, అంతా ఖర్చు పెట్టేయాలని లేదని అన్నారు. టీడీపీ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు మాట్లాడుతూ ఇంటింటి కొళాయి ఇస్తామని పైప్ లైన్ కోసం రోడ్లు తవ్వేసి వదిలేశారని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌కి నాలుగైదు కోట్లు బిల్లు బకాయిలు ఉండడంతో పనులు వదిలేసి పోయినట్టు తెలిసిందని అన్నారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి పథకం పనులన్నీ ఒక కాంట్రాక్టరే చేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే గణేశ్ కాంట్రాక్టర్‌తో మాట్లాడారని, త్వరలో పనులు మొదలు పెడతారని చెప్పారు. పైప్ లైన్ కోసం తవ్విన రోడ్లు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. మంత్రి, ఎంపీ చేయలేని అభివృద్ధిని ఎమ్మెల్యే గణేశ్ చేసి చూపిస్తున్నారని అన్నారు. దీనికి టీడీపీ కౌన్సిలర్ పద్మావతి మాట్లాడుతూ ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో వేదిక ఏర్పాటు చేస్తే చర్చిద్దామన్నారు. చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి మాట్లాడాలని చెప్పారు.

అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

కంకర చిప్స్ వేసి వదిలేయడంతో కొర్రవానిపాలెం గ్రామస్థుల పాట్లు

- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు
- నిర్మాణం పూర్తి చేయాల్సిన గడువు ముగిసి తొమ్మిది నెలలైనా పట్టించుకోని అధికారులు
- కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిచినట్టు ప్రచారం



అసంపూర్తిగా ఉన్న కొర్రవానిపాలెం రహదారి

నక్కపల్లి, జనవరి 6:

అసంపూర్తి రహదారితో మండలంలోని కొర్రవానిపాలెం గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ఇచ్చిన గడువు ముగిసి తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎటువంటి పురోగతి లేదు. కాంట్రాక్టరుకు బిల్లులు మంజూరు చేయకపోవడం వల్లే పనులు నిలిచిపోయాయని తెలిసింది.



రోడ్డుపై కంకర చిప్స్ వేసి వదిలేసిన దృశ్యం

నాలుగు దశాబ్దాల నుంచి ఉపమాక, ఎన్.నర్సాపురం గ్రామాల జంక్షన్ నుంచి కొర్రవానిపాలెం గ్రామానికి వెళ్లే రహదారిని నిర్మించలేదు. దీంతో వర్షం వస్తే ఈ గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం కష్టంగా ఉండేది. దీంతో ఎమ్మెల్యే బాబూరావు సిఫారసు మేరకు పంచాయతీరాజ్‌శాఖ ద్వారా ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ84.6 లక్షలు నిధులు మంజూరు చేసింది. 2023 ఫిబ్రవరి 4న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. టెండరు నిబంధనల ప్రకారం 2023 మార్చి 26 నాటికి ఈ రహదారి పనులను కాంట్రాక్టరు పూర్తి చేయాల్సి వుంది. ఈ రహదారితో పాటు సమీప గ్రామాల్లో మరికొన్ని రహదారుల నిర్మాణ పనులకు సంబంధించి రూ.2.71కోట్లతో రావులపాలేనికి చెందిన కల్యాణి కనస్ట్రక్షన్ సంస్థకు అప్పగించారు. ఇందులో రూ.84.60 లక్షల వ్యయంతో కిలో మీటరు పొడవున కొర్రవానిపాలెం గ్రామానికి తారు రోడ్డు నిర్మించాల్సి వుంది. కానీ ఇప్పటి వరకు రహదారి నిర్మాణం పూర్తి చేయకపోవడం, రోడ్డుపై కంకర చిప్స్ వేసి వదిలేయడం వల్ల ఏ మాత్రం బైక్‌పై వేగంగా వెళ్లినా బోల్తా పడుతున్నారు. వర్షం వస్తే ఈ రోడ్డుపై ప్రయాణించేవారి బాధ వర్ణనాతీతమని చెప్పాలి. గడువు దాటి తొమ్మిది నెలలు పూర్తయినా ఈ రహదారి నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేయడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడం, కాంట్రాక్టరు పట్టించుకోకపోవడం తమ గ్రామానికి శాపంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా కాంట్రాక్టరుకు ఇంకా బిల్లులు చెల్లించాల్సి వుందని, అందు వల్లే పనులు ఆగాయని ప్రాజెక్ట్ అధికారి ఒకరు చెప్పారు. వీలైనంత త్వరలో ఈ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తామని తెలిపారు.

కేజీబీవీ టీచర్ల తొలగింపు

- అనకాపల్లి జిల్లాలో 14 మంది...
- అల్లూరి జిల్లాలో 125 మంది...
- నేడు కొత్తవారికి నియామక పత్రాలు
- సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారుల తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేసే 14 మంది టీచర్లను తొలగిస్తూ శనివారం సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయం అధికారులు ఆదేశాలు ఇచ్చారు. వీరి స్థానంలో ఆదివారం కొత్తవారిని నియమించి, సోమవారం విధుల్లో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కేజీబీవీ టీచర్లు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు మొత్తం 125 మందిని తొలగించారు. దీనిపై ఉద్యోగులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేలా అధికారులు చూడాలి తప్ప... బెదిరింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. శుక్రవారం విజయవాడలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయ ముట్టడి సందర్భంగా ఉద్యోగుల తొలగింపు, షోకాజ్ నోటీస్ జారీ వంటివి ఉండబోవని జేఏసీ నాయకులకు ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. అయితే అందుకు భిన్నంగా ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పలువురు అధికారులు వ్యవహరించడంపై ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇందుకు కేజీబీవీ టీచర్ల సంఘ నేతగా చెప్పుకుంటున్న ఒకరు కారణమని జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. సదరు నేత ఇచ్చిన సమాచారంతోనే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తొలగింపు ఉత్తర్వులు ఇచ్చారన్న ప్రచారం సాగుతుంది. గత ఏడాది ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో విశాఖలోని ఒక హోటల్‌లో వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా సమావేశం ఏర్పాటుచేసి నేతే...ఇప్పుడు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు యత్నిస్తున్నట్టు అనకాపల్లి జిల్లాకు చెందిన ఉద్యోగులు అనుమానిస్తున్నారు.

క్రైం... crime news

వేర్వేరు చోట్ల రైలుకింద పడి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 6: అనకాపల్లికి సమీపంలోని శంకరం ఫ్లై ఓవర్ వంతెన కింద, జాతీయ రహదారిలోని వంతెన కింద జరిగిన రైలు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె.శాంతారాం తెలిపారు. విజయవాడ-విశాఖపట్నం రైల్వే ట్రాక్‌పై శంకరం వద్ద గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడిపోయి మృతి చెంది ఉండొచ్చనని ఎస్‌ఐ తెలిపారు. ఈయన వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని, తెలుపురంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, గ్రే కలర్ ఫుల్ నిక్కరు ధరించి ఉన్నాడని తెలిపారు. అలాగే జాతీయ రహదారిలోని వంతెన వద్ద జరిగిన ప్రమాదంలో మృతుడు వయసు 35 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. మృతుడు లేత ఆకుపచ్చ రంగు చొక్కా, నలుపురంగు ఫుల్‌ప్యాంట్, నలుపురంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మరే ఆధారాలు లభ్యం కాలేదని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు సెల్‌ఫోన్ నంబరు 7673906010కు సమాచారమివ్వాలని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

బుచ్చెయ్యపేట, జనవరి 6 : అనారోగ్యంతో మండలంలోని పొట్టిదొరపాలెంలో నంబారు అప్పారావు(72) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. మధుమేహం, మతిమరుపుతో దీర్ఘకాలికంగా బాధపడుతున్న అప్పారావు శనివారం ఇంటి ఆవరణలో గల మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుమారుడు సత్తిబాబు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ మాజీ సైనికుడు మృతి

అనకాపల్లి టౌన్/కె.కోటపాడు, జనవరి 6: స్థానిక మిరియాలకాలనీ అన్నపూర్ణ బ్యాంకు వద్ద ఈనెల రెండో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మాజీ ఆర్మీ ఉద్యోగి శనివారం ఉదయం విశాఖ ఆస్పత్రిలో మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ ఎస్.సత్యనారాయణ తెలిపారు. కోటపాడు మండలం సూదివలసకు చెందిన రిటైర్డు ఆర్మీ ఉద్యోగి మొల్లి సన్నిబాబు (49) స్థానిక గుండాలవీధి జంక్షన్ వద్ద ఉంటున్నాడన్నారు. ప్రస్తుతం ఈయన స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడన్నారు. ఈనెల రెండో తేదీన తన కుమారుడికి బాగోకపోతే ఆస్పత్రికి వెళ్లేందుకు నడుచుకొని వెళ్తుండగా వెనుక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రథమ చికిత్స అనంతరం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్టు భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గోకులాల షెడ్ల నిధుల స్వాహాపై విచారణ

- అప్పటి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌ను విచారించిన డీఎస్పీ
- షెడ్ల కోసం దరఖాస్తులు చేసిన రైతుల వివరాలు.. తదితరాలపై ఆరా



కోటవురట్ల పోలీస్ స్టేషన్‌లో పాడిరైతులను విచారిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

మాకవరపాలెం, జనవరి 6: గోకులం షెడ్ల నిధుల స్వాహా ఆరోపణలపై డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం ఇక్కడ విచారణ జరిపారు. జిల్లాలోని మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట, గొలుగొండ, రావికమతం తదితర మండలాల్లో గోకులాల షెడ్లు నిర్మించుకున్న రైతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా, సాయిబాలజీ ఎంటర్ ప్రైజెస్ పేరిట నిధులు జమకావడంతో ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. మాకవరపాలెంలో 151 షెడ్లకు గాను ప్రభుత్వం రెండున్నరేళ్ల క్రితం సాయిబాలజీ ఎంటర్ ప్రైజెస్ పేరుమీద రూ.1,55,58,158లను జమ చేసింది. ఈ విషయాన్ని అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వివరాలతో కథనాన్ని ప్రచురించింది. దీంతో టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి గోకులాల షెడ్ల నిధులపై పూర్తి విచారణ చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పశువైద్య శాఖకు సంబంధించి గ్రామాల్లో నేరుగా రైతుల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం నిధుల స్వాహాపై విచారణ చేపట్టిన అధికారులు ఇటీవల అనకాపల్లి జిల్లా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ శ్రీనివాసరావు డిసెంబరు 25వ తేదీన మాకవరపాలెం పోలీసు స్టేషన్‌లో గోకులాల షెడ్లు నిర్మించిన రైతులను పిలిచి విచారణ జరిపారు. శనివారం అప్పటి పశువైద్యాధికారి దుర్గాప్రసాద్‌ను విచారించారు. అప్పట్లో ఈ పథకం కింద షెడ్ల నిర్మాణానికి రైతులు ఎంతమంది దరఖాస్తులు చేశారు, ఎంతమందికి బిల్లులు మంజూరు చేశారు తదితరాలపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ గోకులాల షెడ్లు నిర్మించిన రైతులు బిల్లులు అందకపోతే స్థానిక పోలీస్ స్టేషన్‌లో నేరుగా ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు.

కోటవురట్లలో....

కోటవురట్ల : మినీ గోకులం పథకం కింద షెడ్లు నిర్మించిన రాజుపేట పాడి రైతులను అనకాపల్లి డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం కోటవురట్ల పోలీస్ స్టేషన్‌లో విచారించారు. వారి నుంచి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రమణయ్య, రాజుపేట సర్పంచ్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి : బుద్ద

తుమ్మపాల, జనవరి 6: రాష్ట్రంలో వైసీపీ సాగిస్తున్న అరాచక పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. సైకో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నుంచి రాష్ట్రాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కులాల పేరుతో జగన్‌రెడ్డి ప్రజలను విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టాలని పలు కుట్రలు, కుతంత్రాలతో సోషల్ మీడియాలో వైసీపీ గ్రూపులను ఏర్పాటు చేసి ప్రతిపక్ష పార్టీల కుటుంబాలను టార్గెట్ చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల మహిళల ధన,మాన, ప్రాణాలతో వైసీపీ నాయకులు చెలగాటమాడుతున్నారన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని బాధితులపైనే తిరిగి అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు అనే తేడా లేకుండా పిల్ల సైకోలు కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు రా.. కదిలి రా.. అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పర్యటిస్తున్నారని, ఈ పర్యటనలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

నేడు విశాఖలో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల దీక్షలు

చోడవరం, జనవరి 6: విద్యుత్ శాఖలోని కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆదివారం విశాఖపట్టణంలో గల ఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యనారాయణ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఇక్కడి ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఆందోళన కార్యక్రమానికి కాంట్రాక్టు కార్మికులంతా విచ్చేసి విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాస్కరరావు, రీజినల్ అధ్యక్షులు ప్రేమచంద్రశేఖర్, డివిజన్ అధ్యక్షుడు నాగప్పారావు, కార్యదర్శి కలిమి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరువీధుల్లో ఆధ్యాత్మిక శోభ



తిరువీధుల్లో రాజాధిరాజ వాహనంపై స్వామి ఊరేగింపు (ఇన్‌సెట్‌లో) వెంకన్న

నక్కపల్లి, జనవరి 6: ధనుర్మాసం సందర్భంగా ఉపమాకలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ప్రతి రోజూ స్వామి వారిని అనేక వాహనాల్లో అలంకరించి మాడవీధుల్లో ఊరేగిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం రాజాధిరాజ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామిని, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి ఊరేగించారు. డీఎల్‌పురం గ్రామానికి చెందిన భజన సభ్యులు శ్రీహరి నామసంకీర్తన చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. తదుపరి గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు.

పాఠశాలలో పనుల నాణ్యత పరిశీలన

- నాడు-నేడు నిధుల దుర్వినియోగం ఫిర్యాదుపై ఆర్‌జేడీ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతికుమారి

ఎస్.రాయవరం, జనవరి 6: మండలంలోని రేవుపోలవరంలో నాడు-నేడులో భాగంగా నిర్మిస్తున్న జడ్పీ హైస్కూల్ భవనం కోసం సిద్ధం చేసిన ఇసుక, ఐరన్, పిక్క తదితర మెటీరియల్‌ను శనివారం విశాఖ రీజనల్ జనరల్ స్కూల్ ఎడ్యుకేషన్ జోన్-1 (ఆర్‌జేడీ) జ్యోతి కుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు-నేడు నిధులు దుర్వినియోగంపై విద్యా శాఖ మంత్రి బొత్సకు ఫిర్యాదు అందిందన్నారు. అయన ఆదేశాలతో తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. మెటీరియల్ బాగానే ఉన్నాయన్నారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించి రూ.2.97 కోట్లకు గానురూ.44,65,440 మంజూరయ్యాయన్నారు. ఇందులో 19,74,890 ఖర్చు చేయగా.. మిగతా సొమ్ము హెచ్‌ఎం అక్కౌంట్‌లో ఉందన్నారు. అంతకుముందు విద్యార్థులతో ఆమె మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. ఆమె వెంట ఏఎస్ఎస్ఎన్ మూర్తి, సర్పంచ్ మల్లె లోవరాజు ఉన్నారు.

'భూముల రీ సర్వేలో అభ్యంతరాలు స్వీకరణ'

- సర్వే శాఖ ఏడీ గోపాలరాజు వెల్లడి
- సబ్బవరంలో సర్వే రాళ్లు పాతే ప్రక్రియ పరిశీలన

సబ్బవరం, జనవరి 6 : మండలంలో చేపట్టిన రీ సర్వేకు సంబంధించి రైతుల అభ్యంతరాలను తీసుకుంటామని సర్వే శాఖ ఏడీ సర్వే గోపాలరాజు అన్నారు. సబ్బవరం సచివాలయం-2లో శనివారం రీసర్వేకు సబంధించిన జాబితాను రైతులకు వివరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీ మాట్లాడుతూ.. సబ్బవరంలో 1,368 సర్వే రాళ్లు, ఎల్లుప్పిలో 1,110 సర్వేరాళ్లు, బోదివలసలో 920 సర్వే రాళ్లు పాతేందుకు సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే అసకపల్లిలో 988 రాళ్లు పాతడం జరిగిందన్నారు. సబ్బవరంలో మొదటి విడతగా ప్రభుత్వ భూముల్లో సర్వే రాళ్లు పాతడం ప్రారంభించామన్నారు. రెండు విడతలో జిరాయితీ భూముల్లో పాతడం జరుగుతుందన్నారు. వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలో సర్వే రాళ్లు పాతాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు బైలపూడి దేముడుబాబు, సర్వే ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, తహసీల్దార్ బి.సత్యనారాయణ, డీటీలు వెంకట్, గణేష్, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ జగన్నాథరావు



ప్రచురణల ఆవిష్కరణలో డాక్టర్ జగన్నాథరావు తదితరులు

కొత్తూరు, జనవరి 6: వ్యవసాయ విలువ ఆధారిత ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ఆర్ఏఆర్ఎస్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు అన్నారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'ఆత్మ' ఆధ్వర్యంలో ఈ సమావేశానికి ప్రాజెక్టు డైరెక్టర్ ఆశాదేవి అధ్యక్షత వహించారు. మహిళా రైతులు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. ఇంజనీరింగ్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి, శాస్త్రవేత్తలు రమణమూర్తి, ఆదిలక్ష్మి, ముకుందరావు శిక్షణ ఇచ్చారు. బెల్లం, చిరుధాన్యాలతో విలువ ఆధారిత వస్తువుల ఉత్పత్తిపై ప్రచురించిన రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. శిక్షణలో మూడు మండలాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

'సింహాద్రి' మొదటి యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

- మహిళా ఉద్యోగులదే కీలకపాత్ర : జీజీఎం



కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగినులు

పరవాడ, జనవరి 6 : సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు మహిళా ఉద్యోగులు కీలకపాత్ర పోషించారని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం మొదటి యూనిట్‌ను గతేడాది నవంబరులో షట్‌డౌన్ చేశారు. నాటి నుంచి నిర్వహణ పనులను మహిళా ఉద్యోగుల పర్యవేక్షణలోనే చేపట్టడం జరిగిందన్నారు. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించామని తెలిపారు. ప్రాజెక్టులో గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. శనివారం మహిళా ఉద్యోగులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి ఓఅండ్ఎం విభాగం జీఎం డీపీ పాత్ర, ఆపరేషన్ విభాగం జీఎం పీఆర్ రాజగోపాలన్, మెయింటెనెన్స్ విభాగం జీఎం కె.మ్యాథ్యు తదితరులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలిచి కార్మికులు నిరసన



మోకాళ్లపై నిలిచి సమస్యలపై నినాదాలు చేస్తున్న కార్మికులు

ఎలమంచిలి, జనవరి 6: స్థానిక మునిసిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు శనివారం నాలుగో రోజు సమ్మెలో భాగంగా మోకాళ్లపై నిల్చుని నిరసనను తెలిపారు. మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన శిబిరంలో తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మునిసిపల్ వర్కర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న పట్టణ వీధులు

పారిశుధ్య కార్మికుల సమ్మెలో ఎలమంచిలి పట్టణ వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నది. పట్టణ ప్రధాన రహదారి మినహా మిగిలిన వీధులన్నీ చెత్త చెదారంతో నిండుకుంటున్నాయి. పట్టణంలో ఇంటింట చెత్త సేకరణ నిలిచిపోవడంతో వీధుల్లో చెత్తను వేస్తుండడంతో సమస్య మరింత జటిలంగా మారుతుంది. వీధుల్లో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు నిండిపోవడంతో రోడ్లన్నీ కంపుకొడుతున్నాయి. కొన్ని వీధుల్లో డంపర్ బిన్‌లు చెత్తతో నిండిపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. మునిసిపాలిటీలో మొత్తం 92 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరిలో 78 మంది సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. మిగిలిన వారంతా ప్రధాన రోడ్డు, మార్కెట్ వీధుల్లో చెత్తను తొలగించే పనిలో ఉంటున్నారు. ప్రతి రోజు మునిసిపాలిటీలో 16 టన్నులు చెత్త సేకరించేవారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది రోజుకు 5 నుంచి 7 టన్నులు చెత్తను సేకరిస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన


సమ్మెలో నిద్రిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

అనకాపల్లి రూరల్, జనవరి 6 : మండలంలోని కొండకొప్పాక డీఈవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శనివారం కూడా కొనసాగించారు. దీంతో వారి సమ్మె 18వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణ మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చలో ఎస్‌టీడీ కార్యాలయాన్ని ముట్టడించి నిద్ర లేనప్పటికీ మరలా తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్న ఉద్దేశంతో సమ్మెలో పాల్గొన్నామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు రామచంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని అవతారంలో పాండురంగడు

పాయకరావుపేట, జనవరి6: స్థానిక పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శనివారం పాండురంగస్వామి శ్రీరాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు యి. కృష్ణస్వామి స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజల అనంతరం నూతన వస్త్రాలతో, విల్లంబులు ధరింపజేసి శ్రీరామునిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్. వెంకటాద్రి, అర్చకులు నారాయణాచార్యులు, సిబ్బంది సత్తిబాబు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై డ్రైవర్లు నిరసన

సబ్బవరం, జనవరి 6 : ప్రమాదాలకు కారణమైన డ్రైవర్లపై రూ.7 లక్షల అపరాధ రుసుం, పదేళ్ల జైలు శిక్ష విధించే చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని పలువురు డ్రైవర్లు డిమాండ్ చేశారు. జయహో రథసారథి డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి వాసు, జిల్లా ఇన్‌చార్జి ఆర్ ముత్యాలనాయుడు, పూడి అప్పారావు, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

పాయకరావుపేట, జనవరి 6 : స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించిందని విద్యా సంస్థల అధినేత సీహెచ్‌కే. నరసింహారావు తెలిపారు. కళాశాలలో ఉన్న ప్రమాణాలను పరిగణనలోకి నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ నిర్వహించిన మూల్యాంకన ప్రక్రియను అనుసరించి 3.11 సీజీపీఏతో జాతీయస్థాయిలో ఏ గ్రేడ్ ఇవ్వడం జరిగిందన్నారు. నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు పొందడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందిని, విద్యార్థులను ఆయన అభినందించారు.

విశాఖ-చెన్నై రోడ్డుకు సర్వే రాళ్లు వేయండి

నక్కపల్లి, జనవరి 6: మండలంలోని విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ రహదారికి సంబంధించి ముందుగా సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలని కాగిత గ్రామ రైతులు డిమాండ్ చేశారు. రహదారి నిర్మించే ప్రాంతంలో సర్వే రాళ్లు వేస్తే ఒక అవగాహన కలుగుతుందన్నారు. ఇప్పటికే భూములిస్తున్న రైతుల వివరాలు సేకరిస్తున్నారని చెప్పారు. సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తే ఎవరి భూములు రోడ్డు కోసం కేటాయించారో తెలుస్తుందన్నారు. భూములిచ్చిన రైతులకు సకాలంలో న్యాయం చేయాలని కోరారు. తమ సమస్యను భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు తెలియజేయాలంటూ సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందజేశారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జనవరి 6: శారదానది ఒడ్డున పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. శనివారం శారదానది ఒడ్డున పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో దాడి చేసిఽ నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.1,300 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు చెప్పారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ఎస్.రాయవరం, జనవరి 6: మండలంలోని పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ఆదర్శ విద్యా సంస్థ చైర్మన్ నల్లపరాజు సీతారామరాజు, శ్రీవెంటేశ్వర పోలి క్లీనిక్ డాక్టర్ అనిల్ వర్మ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు జోగినాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్మాపై కదంతొక్కిన అంగన్‌వాడీలు


మునగపాక మెయిన్‌రోడ్‌పై రాస్తారోకో చేస్తున్న అంగన్‌వాడీలు


రాంబిల్లిలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

మునగపాక, జనవరి 6: తమ సమ్మెపై జగన్ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం పట్ల అంగన్‌వాడీలు భగ్గుమన్నారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ మునగపాక మెయిన్‌రోడ్‌పై మానవహారం, రాస్తారోకో చేశారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీలు ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరించి ఎస్మా ప్రయోగించడం వారిని రెచ్చగొట్టడమేనని అన్నారు. ఎటువంటి పరిణామాలైనా ఎదుర్కోవడానికి అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారన్నారు.

తుమ్మపాలలో.. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గపు చర్య అని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి రాజాన దొరబాబు ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అధికంగా పెంచుతామని నాడు హామీ ఇచ్చి నేడు అంగన్‌వాడీలు అడిగితే ఎస్మాను ప్రయోగించడాన్ని తప్పుబట్టారు.

రాంబిల్లిలో.. కనీస వేతనాలు పెంచమని అడిగినందుకు ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం ఏమిటని ఎలమంచిలి అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు బి.జయలక్ష్మి ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న నిరసన శనివారానికి 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగనన్న అంగన్‌వాడీలకు న్యాయం చేస్తానని మాట ఇచ్చి నేడు మాట నిలబెట్టుకోకుండా ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం లైనుకొత్తూరులో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల నిరసన శిబిరానికి టీడీపీ, జనసేన నేతలు పూర్తి మద్దతు ప్రకటించారు. నిరసన శిబిరంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు కూర్చొన్నారు.

పరవాడలో.. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న అంగన్‌వాడీల సమ్మె 26వ రోజు శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కాగా, అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 2ను జారీ చేయడాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తక్షణమే జీవోను ఉపసంహరించుకోవాలని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదే వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

టీడీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

» పొలిట్ బ్యూరో సభ్యురాలు అనిత

పాయకరావుపేట, జనవరి 6 : తెలుగుదేశం పార్టీ విజయానికి కార్యకర్తలందరూ సమిష్టిగా కృషిచేయాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత అన్నారు. పట్టణ కార్యాలయంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు వైసీపీ ప్రభుత్వ అవినీతి, నిరంకుశ పాలనను, టీడీపీ గ్యారెంటీ పథకాలను ప్రజలకు తెలియజేసి, పార్టీ విజయానికి పాటు పడాలన్నారు. అంతకుముందు బూత్ స్థాయిలో నిర్వహించిన సర్వే వివరాలను కార్యకర్తలకు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, అబద్దం, జానకి శ్రీను, పెదిరెడ్డి శ్రీను, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, వినోద్‌రాజు, ఎం.రమాకుమారి, యాళ్ల వరహాలు, కాశీవిశ్వనాథ్, లాలం కాశీనాయుడు, కట్టా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అనిత


గెడ్డం బుజ్జిని కలిసి మాట్లాడుతున్న అనిత

గెడ్డం బుజ్జిని కలిసిన అనిత

పాయకరావుపేట రూరల్: తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత శనివారం జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జిని గుంటపల్లిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 2024 ఎన్నికలలో టీడీపీ, జనసేన పార్టీ కలిసి పోటీ చేస్తున్న నేపథ్యంలో గెడ్డం బుజ్జిని కలిసి ఎన్నికల గురించి చర్చించారు. ఇరువురు భేటీ నియోజకవర్గంలో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆమె వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచిన సీఎం

» మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి


పింఛన్లు అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

కశింకోట, జనవరి 6 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పింఛను రూ.3 వేలు జనవరి నెల నుంచి పెంచారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి అన్నారు. శనివారం కశింకోటలో పింఛన్లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వెదురుపర్తి వద్ద శారదానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులకు 90లక్షలు మంజూరయ్యాయని, ఈ పనులను ఫిబ్రవరి నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, వైసీపీ నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ బీవీ. సత్యవతి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం ప్రారంభించారు. ఇందిరమ్మ కాలనీలో ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, 13 చేతి బోర్లు, శ్మశానవాటికలో చేతి బోర్లును వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కలగా లక్ష్మి, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపీడీవో రవికుమార్, సర్పంచ్ జయరజిని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైసీపీ మండల అధ్యక్షుడు మలసాల కిషోర్ పాల్గొన్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంచండి : ఆర్‌జేడీ

ఎలమంచిలి, జనవరి 6: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఉత్తీర్ణతా శాతం పెంపునకు ఉపాధ్యాయులంతా సమిష్టిగా కృషి చేయాలని ప్రాథమిక విద్యాశాఖ ఆర్‌జేడీ జ్యోతి కుమారి అన్నారు. శనివారం ఎలమంచిలి సెయింట్ మేరీస్ స్కూలులో నిర్వహించిన జిల్లా ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, విద్యావ్యాప్తికి ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలు గురించి వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపవిద్యాధికారి అప్పారావు, ఎంఈవోలు,హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పరవాడ, జనవరి 6 : కేంద్రంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు పిలుపునిచ్చారు. పరవాడ, వెన్నెలపాలెంలో శనివారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో అన్ని వర్గాల ప్రజలను సంపన్నులు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందన్నారు. అంతకుముందు డ్వాక్రా మహిళలతో మాట్లాడారు. అనంతరం పలువురు మహిళలకు ఆయుష్మాన్‌భవ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెన్నెల అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, వరలక్ష్మి, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి షెడ్ నిర్మాణం

ఎస్.రాయవరం, జనవరి 6: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో ఇటీవల గ్యాస్ లీకై ఇల్లు దగ్ధమైన జోగ రమణ, మంగల కుటుంబానికి అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ చైర్మన్ సియ్యాదుల అచ్యుత్‌కుమార్ షెడ్ నిర్మించారు. ఈ షెడ్‌ను ఆయన శనివారం ప్రారంభించారు.

గణపతి ఆలయ ధ్వజస్తంభానికి పూజలు

నక్కపల్లి, జనవరి 6: స్థానిక వీవర్స్ కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న గణపతి ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు శనివారం పూజలు చేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ, పద్మశాలి సంక్షేమ సంఘం ప్రతినిధుల నేతృత్వంలో పురవీధుల్లో ధ్వజస్తంభాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. అనంతరం ధ్వజస్తంభానికి రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ పూజలు పాల్గొన్నారు.

ఆది నుంచి అవమానాలే

... 5వ పేజీ తరువాయి

సమాచారం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌ను తెలియజేయలేదు. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్‌ను ఆమె పిలిపించి అడిగిన తరువాత గానీ షెడ్యూల్ ఇవ్వలేదు.

వాట్సాప్‌లో ఆహ్వానం..వీలుంటే రండి..

యూనిఫెస్ట్ వేడుకలను శుక్రవారం సాయంత్రం వర్సిటీలో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే, ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వానాన్ని ఇన్‌చార్జ్ వీసీకి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ వాట్సాప్‌లో పంపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా రిజిస్ట్రార్ మూడు గంటలకు వీసీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఆమె...కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా అంటూ ప్రశ్నించారు. అలాగే వర్సిటీలో ఇంత పెద్ద కార్యక్రమం జరుగుతున్నప్పుడు ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఎందుకు ఏర్పాటుచేయలేదని అడిగారు. అందుకు ఆయన...అన్నీ తాను చూసుకుంటానని, 'వీలుంటే రండి' అంటూ వెళ్లిపోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్‌చార్జ్ వీసీ వేడుకలకు దూరంగా ఉండిపోయారు.

సార్ రేపే వస్తున్నారంటూ ప్రచారం..

తన వద్దకు ఎవరూ రాకుండా, కనీసం గౌరవం ఇవ్వకపోవడం వెనుక వర్సిటీలోని కొంతమంది అధికారుల పాత్ర ఉందని ఇన్‌చార్జి వీసీ కె.సమత అభిప్రాయపడుతున్నారు. 'సార్ రేపే వస్తున్నారు.. బాధ్యతలు తీసుకుంటున్నారు' అంటూ కొందరు ప్రచారం చేస్తుండడంతో అధికారులు, ప్రిన్సిపాల్స్, స్టాఫ్ చాలామంది ఇన్‌చార్జ్ వీసీ ఛాంబర్ వైపు వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు కూడా చాలామంది అధికారులు ఇన్‌చార్జి వీసీ ఛాంబర్‌కు వెళ్లలేదు. కనీసం మహిళా అధికారులు కూడా వెళ్లకపోవడంతో ఇన్‌చార్జ్ వీసీ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది. తనను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించిందని, తానేమీ కావాలని కూర్చోలేదంటూ పలువురి వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. వ్యక్తిగతంగా తనకు గౌరవం ఇవ్వకపోయినా పర్వాలేదని, కానీ, వీసీ సీటుకు కూడా గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు బాధిస్తోందని వాపోయినట్టు తెలిసింది.

ధారపాలెంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రాంబిల్లి, జనవరి 6 : మండలంలోని ధారపాలెంలో శనివారం 1966- 67 సంవత్సరంలో కశింకోట డీపీఎన్ జడ్‌పీ హైస్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సీ చదువుకున్న పూర్వపు విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. వివిధ జిల్లాల్లో పలు రంగాల్లో స్థిరపడిన వీరు పంచదార్లకు చెందిన వసంతవాడ పురుషోత్తమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు.

గోకివాడ పాల సొసైటీ అధ్యక్షుడిగా నరసింగరావు


నరసింగరావును అభినందిస్తున్న ప్రగడ, దూళి

రాంబిల్లి, జనవరి 6 : మండలంలో శనివారం జరిగిన గోకివాడ పాల సొసైటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా టీడీపీ నాయకుడు నందవరపు నరసింగరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నరసింగరావును టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించి పాలన చేసిన వైసీపీ ప్రభుత్వంపై విసుగు చెందిన ప్రజలు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పాలన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ద్వారపురెడ్డి నానాజీ, నీరుకొండ సూరిబాబు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే ప్రజారంజక పాలన సాధ్యం'

ఎలమంచిలి, జనవరి 6: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రజారంజక పాలన చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కాండ్రకోట చిరంజీవి అన్నారు. శనివారం ఏటికొప్పాకలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటా తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధానాల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దారపోలయ్య, ఊడి రామకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి'

పరవాడ, జనవరి 6 : తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అట్టా సన్యాసిఅప్పారావు అన్నారు. కన్నూరు శివారు మడకపాలెంలో శనివారం బాబుషూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పైలా బుజ్జి, పోతల నూకరత్నం, మడక సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఎమ్మెల్యేల మార్పు : పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 6 : రానున్న ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల మార్పునకు తెరతీశారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమన్నారు. సైకో పాలనకు మరో వంద రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. అదుపు తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరసపల్లి సన్యాసిరావు, బీఎస్ఎంకే జోగినాయుడు, కర్రి బాబి, పోలారపు త్రినాథ్, ఆకుల నానాజీ, సైనిక్ పాల్గొన్నారు.

ఇంటింటా అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

నక్కపల్లి, జనవరి 6: మండలంలోని కాగిత, రాజయ్యపేటల్లో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శనివారం పంపిణీ చేశారు. గ్రామంలో వున్న దుర్గాదేవి ఆలయం నుంచి పురవీధుల్లో గ్రామపెద్దలు, మహిళా భక్తులు రామనామ సంకీర్తన చేస్తూ ఇంటింటా అక్షింతలు, అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ కరపత్రాలను పంపిణీ చేశారు.

వాహనాలను అడ్డుకున్న మునిసిపల్ కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 6 : జీవీఎంసీ జోనల్ కార్యాలయం నుంచి చెత్తను తరలిస్తున్న వాహనాలను పారిశుధ్య కార్మికులు శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ జోనల్ కార్యాలయం వద్ద కార్మికులు చెత్త లారీలను నిలుపుదల చేసి నిరసన వ్యక్తం చేశారన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్మికులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చండీయాగ దీక్షలు

అనకాపల్లి టౌన్, జనవరి 6 : స్థానిక గవరపాలెం గంగిరేవిచెట్టు వద్ద గంగపరదేశమ్మ భవానీ భక్తుల ఆధ్వర్యంలో జరిగిన కనకదుర్గమ్మ అమ్మవారి చండీయాగ దీక్షలు శనివారంతో ముగిశాయి. భవానీలు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఇరుముడి కట్టుకుని విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో జరిగే చండీయాగ పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీరామ్ దంపతులు, మద్దాల శ్రీను, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డైట్‌లో ముగిసిన వర్కుషాపు

అనకాపల్లి టౌన్, జనవరి 6 : డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ నిర్వహించిన వర్కుషాపు శనివారంతో ముగిసింది. ఈ వర్కుషాపులో క్లౌడ్ ఫౌండేషన్, క్లౌడ్ ఆపరేషన్ కోర్సుపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు సీఎస్ఎం విభాగాధిపతి అడపా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ వర్క్‌షాపులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు,రీసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

ప్రజల మధ్య విద్వేషాలు రగిలిస్తున్న కేంద్రం

» కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగాధర్



సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

అనకాపల్లి టౌన్, జనవరి 6: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య విద్వేషాలను రగిలిస్తుందని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ కో-ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ఐఆర్ గంగాధర్ అన్నారు. శనివారం గాంధీనగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగస్ఫూర్తి, విలువలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు బీజేపీ విధానాలకు అండగా నిలవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సామాజికవర్గాల, సంఘాలు, మేధావులతో జిల్లాస్థాయిలో ఈనెల 8వ తేదీన అవినాష్ పవర్ జిమ్‌లో సమావేశం జరుగుతుందని గంగాధర్ పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లాకార్యదర్శి కొల్లి సత్యారావు, బీసీ హక్కుల సంఘం నాయకులు వీరేశ్వరపు రాంప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీ నేతలు బయటకు రావాలి : బీవీ రామ్

అనకాపల్లి టౌన్, జనవరి 6 : ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి బయటకు రావాలని, అలా రాకపోతే ఉత్తరాంధ్ర ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాజీ మంత్రి దాడి వీరభద్రరావును ఆయన గృహంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, కుటుంబసభ్యులు, అనుచరులు టీడీపీలోకి రావడం శుభపరిణామమన్నారు. ఉత్తరాంధ్రకు చెందిన ప్రతి ఒక్క వైసీపీ నాయకుడు వీరభద్రరావు బాటలో పయనించి ఆ పార్టీ నుంచి బయటకు రావాలన్నారు. కార్యక్రమంలో మద్దాల కృష్ణ, బోలినేని వెంకటేశ్వరరావు, డొక్కా నాగభూషణం, దాడి ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి : పీలా


సర్టిఫికెట్‌ను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి రూరల్, జనవరి 6: మండలంలోని కోడూరు పంచాయతీ శివారు గొల్లపేటలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎప్పటికప్పుడు రక్తదానం చేయాలన్నారు. సుమారు 40 మంది రక్తదానం చేయగా- సేకరించిన యూనిట్లను అమ్మ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి కాశీనాయుడు పాల్గొన్నారు.

నేడు వివేకానందనగర్‌లో వైద్యశిబిరం

అనకాపల్లి టౌన్, జనవరి 6 : స్థానిక వివేకానందనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఈనెల ఏడో తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వేదిక కన్వీనర్ మళ్ల చంద్రశేఖర్ తెలిపారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత మెడికల్ క్యాంప్‌లో ఫిట్స్, పక్షవాతం, నరాల బలహీనత, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తారన్నారు.

జనసేనలో చేరిన 30 మంది యువకులు


జనసేన కండువాలు కప్పుతున్న సుందరపు విజయకుమార్

రాంబిల్లి, జనవరి 6: అచ్యుతాపురం పంచాయతీకి చెందిన నిమ్మాడ చిన్నారావుతో పాటు 30 మంది యువకులు హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం జనసేనలో చేరారు. పార్టీలోకి చేరిన వీరికి జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయకుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం విజయకుమార్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలమంచిలిలో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి మోటూరి త్రివేణి, అచ్యుతాపురం మండల పార్టీ అధ్యక్షులు బైలపూడి రామదాసు, ప్రధాన కార్యదర్శి పవన్‌విజయ్, సర్పంచ్ కరెడ్ల సూర్యప్రకాష్, పాల్గొన్నారు.

మైహోమ్ సిమెంటు పరిశ్రమకు అవార్డు

ఎలమంచిలి, జనవరి 6 : మండలంలోని ములకలాపల్లి మైహోమ్ సిమెంటు పరిశ్రమకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్(బీఐఎస్) అవార్డు వచ్చింది. సిమెంటు తయారీలో అత్యున్నత ప్రమాణాలు పాటించడం, ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవడం, నాణ్యమైన సిమెంటు తయారు చేసినందుకు ఈ పురస్కారం దక్కిందని పరిశ్రమ ప్రతినిధి తెలిపారు. ఈనెల ఐదో తేదీన విజయవాడలో జరిగిన కార్యక్రమంలో బీఐఎస్ సీనియర్ డైరెక్టర్ ఎంజి వినోద్ చేతుల మీదుగా మైహోమ్ అసిస్టెంట్ మేనేజర్ కె.హరిప్రసాద్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(వర్క్స్)వీహెచ్. చౌదరి మాట్లాడుతూ ఇది కార్మికులు, ఉద్యోగుల సమిష్టి కృషి వల్ల సాధించామన్నారు.

ఏఎల్‌పురంలో 'గృహ నిర్మాణ' నిధులు పక్కదారి

- 43 పాత ఇళ్లకు, రెండు అంతస్తుల భవనాలకు 'జగనన్న ఇళ్ల' బిల్లులు మంజూరు
- బినామీల పేరుతో 'కౌలు రైతు' నిధులు కాజేసిన నాయకులు
- మాజీ జడ్పీటీసీ తారకవేణు గోపాల్ ఆరోపణ : విచారణకు డిమాండ్


విలేకరులతో మాట్లాడుతున్న వేణుగోపాల్

కృష్ణాదేవిపేట, జనవరి 6 : గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో జగనన్న ఇళ్ల కాలనీకి సంబంధించి అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ ఆరోపించారు. జగనన్న ఇళ్ల కాలనీలో పాత ఇళ్లకు, రెండంతస్తుల భవనాలకు ఇష్టారాజ్యంగా అధికారులు బిల్లులు మంజూరు చేశారన్నారు. శనివారం ఇక్కడి అల్లూరిపార్కులో టీడీపీ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామానికి 273 జగనన్న, ఇతర పథకాల ద్వారా 273 ఇళ్లు మంజూరైనట్టు చెప్పారు. కాగా ఇందులో 43మందికి పాత ఇళ్లకు, రెండు అంతస్తుల భవనాలకు నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణ విభాగం అధికారులు, సిబ్బంది బిల్లులు మంజూరు చేశారని ఆయన ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ అంశంపై సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు చెప్పారు. అలాగే గ్రామంలో కౌలు రైతుల పేరుతో భూమిలేని, సాగుచేయని వారిపేర్లు పెట్టి స్థానిక నాయకులు నిధులు కాజేశారని ఆరోపించారు. ఈ అవినీతి తంతుపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ, టీడీపీ నాయకులు రుత్తల శేఖర్, లగుడు రమేష్, సన్నిబాబు, ఎస్.అప్పలరాజు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో బీసీలకు అన్నింటా అన్యాయం'

చోడవరం, జనవరి 6 : వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో బీసీలకు అన్నివిధాలా అన్యాయం జరుగుతోందని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ బీసీలు టీడీపీతో ఉన్నారన్న అక్కసుతో వారిని అణగదొక్కాలన్న కుట్రతోనే వైసీపీ సర్కారు వారిని బలిపశువుగా మార్చివేస్తున్నదని వాపోయారు. టీడీపీ హయాంలో బీసీ సబ్ ప్లాన్ అమలుతో పాటు, కులవృత్తులు, చేతివృత్తుల వారికి ఆదరణ పథకం ద్వారా ఆదుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. జగన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక పాలనను గుర్తిస్తున్న ప్రజలు ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు : పీవీజీ కుమార్

కె.కోటపాడు, జనవరి 6 : వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో నష్టపోయిన రాష్ట్రం మళ్లీ ప్రగతి పథాన పయనించాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ అన్నారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ జగన్ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టారు. ఈ సమావేశంలో జూరెడ్డి రాము, రామారావు, రమేషు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్మా' ప్రయోగించినా ఏమాత్రం తగ్గం

- అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు స్పష్టీకరణ
- జీవో నెంబరు 2 ప్రతులు దహనం
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక


నర్సీపట్నంలో గంగిరెద్దుకు వినతిని చూపుతూ అంగన్‌వాడీల నిరసన

బుచ్చెయ్యపేట, జనవరి 6 : డిమాండ్ల సాధనకు సమ్మె చేపడుతున్న తమపై వైసీపీ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ బుచ్చెయ్యపేటలో శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జీవో నెంబరు 2 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.వి.నాయుడు మాట్లాడుతూ అత్యవసర సేవా రంగాలకు వినియోగించవలసిన ఎస్మా చట్టాన్ని అంగన్‌వాడీలపై ప్రయోగించడం అరాచకమని విమర్శించారు. ఇటువంటి బెదిరింపులకు జడిసేది లేదని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్లు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి పాల్గొన్నారు.

నర్సీపట్నం, జనవరి 6 : డిమాండ్ల సాధనకు సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రోజురోజుకు ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రిలే దీక్షలు చేపట్టి, గంగిరెద్దుకు వినతి పత్రం చూపించి నినాదాలు చేశారు. సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకురాలు డి.మహాలక్ష్మి, సామ్రాజ్యం, వరలక్ష్మి, శోభా తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన ఆందోళన శనివారం 26వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీరంతా డిమాండ్లపై నినాదాలు చేశారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి సంఘీభావం ప్రకటించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భ్రమరాంబ, సత్య, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : అంగన్‌వాడీ కార్మికులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబరు-2ను రద్దుచేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలిదేముడునాయుడు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న సమ్మెపై ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ సమ్మెలో అంగన్‌వాడీ కార్మిక సంఘం మండల నాయకులు ఎం.జానకి, రామలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల: ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడంపై ఇక్కడ ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు చేపడుతున్న తమ ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇటువంటి బెదిరింపులకు తాము జడిసేది లేదని స్పష్టం చేశారు.


బుచ్చెయ్యపేటలో జీవో నెంబరు 2 ప్రతిని దహనం చేస్తున్న దృశ్యం

కె.కోటపాడు : డిమాండ్ల పరిష్కారానికి అంగన్ వాడీలు చేస్తున్న దీక్షలను విచ్ఛిన్నం చేయడానికి ముఖ్యమంత్రి జగన్ జీవో నెంబరు2ను తీసుకురావడం దారుణమని పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతున్న జగన్‌కు రానున్న ఎన్నికల్లో భంగపాటు తప్పదని హెచ్చరించారు.


చీడికాడల నిరసన తెలుపుతున్న దృశ్యం


మాగుగులలో..


గొలుగొండలో..

పారిశుధ్య కార్మికులు భిక్షాటన

నర్సీపట్నం, జనవరి 6 : సమస్యలపై ఆందోళనకు దిగిన పారిశుధ్య కార్మికులు శనివారం ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పన్నెండు రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇదిలావుంటే, వీరి సమ్మెతో వార్డులలో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


నర్సీపట్నంలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

ప్రాంతీయ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలి

నర్సీపట్నం : పట్టణంలోని ప్రాంతీయ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు ఎల్‌వీ రమణ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ అధ్యక్షతన ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 549 ప్రకారం జిల్లాలో రూ.16వేలు జీతం అమలు కాకపోవడం అన్యాయమన్నారు. సెక్యూరిటీ గార్డులకు కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు చెల్లించక పోయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రతి నెలా ఏడో తేదీలోపు జీతాలు, రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని, ఎనిమిది గంటల షిఫ్ట్ డ్యూటీలు అమలు చేయాలని కోరారు. అనంతరం ఏరియా ఆస్పత్రి ఉద్యోగికి వినతి పత్రం అందజేశారు.

ప్రతి ఇంటికి బ్యాంకు ఖాతా ఉండాలన్నదే లక్ష్యం : డీసీసీబీ సీఈవో

దేవరాపల్లి, జనవరి 6 : ప్రతి ఒక్కరూ డీసీసీబీ ఖాతాదారులు కావాలన్నదే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్య నిర్వాహణాధికారి డీవీ ఎస్. వర్మ తెలిపారు. ఇందుకు సంబంధించి దేవరాపల్లిలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్రాంచ్‌ల ఉన్న గ్రామాల్లో మార్చి నెలాఖరు వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికీ రుణ సదుపాయం కల్పించేందుకు ఈకార్యక్రమం చేపట్టామన్నారు. తమ పరిధిలో 2,150 కోట్లు వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. ఐదులక్షల మంది ఖాతాదారులు ఉన్నట్టు చెప్పారు. సంఘాల ద్వారా రూ.50కోట్లు రుణాలు మార్చిలోగా అందజేస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలో 12, అల్లూరు జిల్లాలో రెండు, విశాఖ జిల్లాలో పద్మనాభం, ఆనందపురం మండలాల్లో కొత్త బ్రాంచిలు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో బాంకు జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, నోడల్ అధికారి కె.వి.ఎస్.రామకృష్ణ, బ్రాంచి మేనేజర్ జి.వి.అప్పారావు, దాసరి గోపి తదితరులు పాల్గొన్నారు.

'దళిత సేవ' కార్యాలయం ప్రారంభం

నర్సీపట్నం అర్బన్, జనవరి 6 : మునిసిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లిలో శనివారం దళిత సేవ పరిరక్షణ ప్రధాన కార్యాలయాన్ని ఆర్డీవో జయరాం, మునిసిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ గుదిబండ ఆదిలక్ష్మి, దళిత నాయకుడు అప్పలరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి ఆర్డీవో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

నాతవరం, జనవరి 6 : సంక్రాంతి పండగను పురస్కరించుకుని పారుపల్లి కిరణ్, శెట్టి సతీష్, పైల వెంకటరమణ (కేఎస్‌ఆర్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంటు శనివారం ఇక్కడ ప్రారంభమైంది. తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు. మొత్తం 28 జట్లు ఈ పోటీలో తలపడుతున్నట్టు నిర్వాహకుడు శెట్టి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పైల సూరిబాబు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇటంశెట్టి సీతారామ్మూర్తి, టీడీపీ నాయకులు శెట్టి లోవ, బంగారు సూరిబాబు, శెట్టి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం చూపకుంటే చావే శరణ్యం

- పెదగంగవరం గ్రామస్థుల ఆవేదన


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకుడు కేవీ రమణ

దేవరాపల్లి, జనవరి 6 : పెదగంగవరంలో దీర్ఘకాలంగా నివాసం ఉంటున్నామని, తమ సాగులో ఉన్న భూములపై హక్కులు కల్పించడంలో మాత్రం తమకు అన్యాయం జరుగుతోందని ఆ గ్రామ వాసులు పలువురు వాపోయారు. 'అయితే శాశ్వత హక్కు కల్పించండి..., లేదా ఆత్మహత్యలు చేసుకోవడానికి అనుమతులు ఇప్పించండి...' అంటూ వేడుకున్నారు. శ్రీరామ రైతు సంక్షేమ సంఘం నాయకులు కేవీ రమణతో పాటు, ఆ గ్రామ పెద్దలు శనివారం విలేకరులతో మాట్లాడుతూ దేవరాపల్లి సమీపంలో ఉన్న అల్లూరి సీతారామ రాజు జిల్లా అనంతగిరి మండలం జీనబాడు పంచాయతీ శివారు గ్రామమైన పెదగంగవరంలో 1847 నుంచి తమ తాతతండ్రుల నుంచి నివశిస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి రాజ్యాంగపరమైన హక్కులు కలిగి ఉన్న తమపట్ల గిరిజన సంఘాల నాయకులు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబించడం వలన నేటికీ ఎటువంటి లబ్ధిపొందలేకపోతున్నామని వాపోయారు. ప్రస్తుతం 300 కుటుంబాలవారం నివశిస్తున్నామని 1/70 చట్టం అడ్డం పెట్టుకొని ఉంటుండడం తమకు రావలసిన సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నామని వాపోయారు. ఇప్పటికే కొందరు భూములు వదిలి వలస బాటపట్టారని, గతంలో మనస్తాపం చెంది సుమారు 30 మంది రైతులు అమరులయ్యారని పేర్కొన్నారు.

ఇప్పటి వరకు ఎన్నో ప్రభుత్వాలు మారినా తమకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే తమకు చావడమే చరణ్యమన్నారు. అధికార యంత్రాంగం తమ ఆధారాలను పరిశీలించి, సమస్యకు పరిష్కార మార్గం చూపాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు కొటాన అక్కునాయుడు, తోట దేముడు, కొటాన రాము, మిడతాడ శ్రీను, ద్వారపురెడ్డి అప్పలనాయుడు, సింహ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం


మృతుని కుటుంబానికి చెక్ అందిస్తున్న విజయ్

మాకవరపాలెం, జనవరి 6 : ఇటీవల మాకరపాలెంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందిన పెదపల్లి సాయి అనే యువకుడి కుటుంబ సభ్యులకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ శనివారం రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన తామరం ప్రభాకర్ రాజు ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకుల ఇసుక దందా వల్ల ఒక యువకుడు చనిపోతే నేటికీ ఎమ్మెల్యే గాని, స్థానిక పార్టీ నాయకులుగాని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ట్రాక్టరు ఢీ కోట్టడం వల్లే ఆ వ్యక్తి చనిపోయాడని ఇప్పటికే పోలీసులు కేసు నమోదు చేశారని వివరించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హమీ ఇచ్చారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, నాయకులు అల్లు రామునాయుడు, ప్రభాకర్‌రాజు, కేతిరెడ్డి చిరంజీవి, కోసూరు శ్రీనివాస్, లాలం రాము తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌లే ప్రశ్నలు సంధించారు

- రోలుగుంట మండల సమావేశానికి గైర్హాజరైన ప్రజాప్రతినిధులు
- కుటుంబ సభ్యులు విచ్చేసి సమస్యల ప్రస్తావన
- మ.మ. అనిపించిన అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న జగ్గంపేట మాజీ ఎంపీటీసీ రమణ


సమస్య వివరిస్తున్న నిండుగొండ సర్పంచ్ భర్త

రోలుగుంట, జనవరి 6 : హాజరు కావాల్సిన ప్రజాప్రతినిధులు చాలామంది ముఖం చాటేశారు.. వారి స్థానాల్లో వారివారి కుటుంబ సభ్యులు విచ్చేసి పెద్దరికాన్ని ప్రదర్శించారు. ఇక వివిధ శాఖల అధికారులు సైతం తామేమీ తక్కువ కాదన్నట్టు గైర్హాజరయ్యారు. ఫలితంగా రోలుగుంట మండల సర్వసభ్య సమావేశం శనివారం బోసిపోయి, మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటైన ఈ సమావేశానికి మండలంలోని 24 పంచాతీయల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సి ఉండగా, పలువురు సూపర్‌లు (వారివారి కుటుంబ సభ్యులు) విచ్చేయడం విశేషం. నిండుగొండ నుంచి సర్పంచ్ శెట్టి సంధ్య హాజరు కావాల్సి ఉండగా ఆమె భర్త విచ్చేశారు.

వడ్డిపనుంచి కర్రి అన్నపూర్ణ బదులు భర్త రాము, అర్ల నుంచి వండలపు వాణికి బదులు ఆమె తమ్ముడు రాజా రావు హాజరయ్యారు. మిగతా వారిలో అత్యధికమంది గైర్హాజరయ్యారు. అలాగే, 14 సెగ్మెంట్ల నుంచి ఎంపీటీసీలు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు ముగ్గురు తప్ప అంతా సూపర్‌లే హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన తర్వాత ముగ్గురు నలుగురు వెళ్లిపోయారు.

కాగా ఈ సమావేశంలో సూపర్‌లే అధికారులను సమస్యలపై ప్రశ్నించారు. కొంతమంది మాజీప్రజాప్రతినిధులు కూడా సమావేశంలో ప్రత్యక్షమై సమస్యలను లేవనెత్తారు. దీనిపై సంబంధిత అధికారులు కూడా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం విశేషం. రెవెన్యూ, విద్యుత్, పశు సంవర్ధక, ఉపాధి హామీ, స్త్రీశిశు సంక్షేమ, హౌసింగ్ శాఖల అధికారులు మాత్రమే తమ శాఖలకు సంబంధించి ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. మిగతా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో నూకరాజు, తహసీల్దార్ వరహాలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం అర్బన్/మాకవరపాలెం/చీడి కాడ/మాడుగుల రూరల్, జనవరి 6 : పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన, పెరిగిన పింఛన్ల నగదును ఎమ్మెల్యే గణేశ్ పలువురు లబ్ధిదారులకు శనివారం అందజేశారు. చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, కమిషనర్ రవిబాబు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ఏకాశివ తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం మండల పరిషత్ కార్యాలయంలోనూ ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో సీతా మహాలక్ష్మి జడ్పీటీసీ పెట్ల సత్యవేణి, వైసీపీ మండల అధ్యక్షుడు రుత్తల వాసు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ కురచా జయమ్మ 41 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. జడ్పీటీసీ లాలం శారదవరలక్ష్మి, ఎంపీడీవో జయప్రకాశరావు, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, యూత్ అధ్యక్షుడు స్వామి నాయుడు, పరవాడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మాడుగుల మండలంలోని కింతలి వల్లాపురంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపురెడ్డి రాంబాబు, సోమన్నదొర, మట్టా గోవింద్, పంచాయతీ కార్యదర్శి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆది నుంచీ అవమానాలే

... 5వ పేజీ తరువాయి

సమాచారం ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్‌ను తెలియజేయలేదు. ఈ ఫెస్ట్‌కు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్‌ను ఆమె పిలిపించి అడిగిన తరువాత గానీ షెడ్యూల్ ఇవ్వలేదు.

వాట్సాప్‌లో ఆహ్వానం..వీలుంటే రండి..

యూనిఫెస్ట్ వేడుకలను శుక్రవారం సాయంత్రం వర్సిటీలో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే, ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వానాన్ని ఇన్‌చార్జ్ వీసీకి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్ వాట్సాప్‌లో పంపారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉండగా రిజిస్ట్రార్ మూడు గంటలకు వీసీ వద్దకు వెళ్లారు. ఆ సమయంలో ఆమె...కార్యక్రమానికి ఆహ్వానించే పద్ధతి ఇదేనా అంటూ ప్రశ్నించారు. అలాగే వర్సిటీలో ఇంత పెద్ద కార్యక్రమం జరుగుతున్నప్పుడు ప్రిన్సిపాల్స్‌తో సమావేశం ఎందుకు ఏర్పాటుచేయలేదని అడిగారు. అందుకు ఆయన...అన్నీ తాను చూసుకుంటానని, 'వీలుంటే రండి' అంటూ వెళ్లిపోయారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్‌చార్జ్ వీసీ వేడుకలకు దూరంగా ఉండిపోయారు.

సార్ రేపే వస్తున్నారంటూ ప్రచారం..

తన వద్దకు ఎవరూ రాకుండా, కనీసం గౌరవం ఇవ్వకపోవడం వెనుక వర్సిటీలోని కొంతమంది అధికారుల పాత్ర ఉందని ఇన్‌చార్జి వీసీ కె.సమత అభిప్రాయపడుతున్నారు. 'సార్ రేపే వస్తున్నారు...బాధ్యతలు తీసుకుంటున్నారు' అంటూ కొందరు ప్రచారం చేస్తుండడంతో అధికారులు, ప్రిన్సిపాల్స్, స్టాఫ్ చాలామంది ఇన్‌చార్జ్ వీసీ చాంబర్ వైపు వెళ్లేందుకు ఆసక్తి చూపించడం లేదు. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసేందుకు కూడా చాలామంది అధికారులు ఇన్‌చార్జి వీసీ ఛాంబర్‌కు వెళ్లలేదు. కనీసం మహిళా అధికారులు కూడా వెళ్లకపోవడంతో ఇన్‌చార్జ్ వీసీ తీవ్ర మనస్తాపానికి గురైనట్టు తెలిసింది. తనను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించిందని, తానేమీ కావాలని కూర్చోలేదంటూ పలువురి వద్ద ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్టు చెబుతున్నారు. వ్యక్తిగతంగా తనకు గౌరవం ఇవ్వకపోయినా పర్వాలేదని, కానీ, వీసీ సీటుకు కూడా గౌరవం ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు బాధిస్తోందని వాపోయినట్టు తెలిసింది.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపోత్సవం



బుచ్చెయ్యపేట, జనవరి 6 : మండలంలోని పోలేపల్లిలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెల రోజుల పాటు గ్రామంలో ఆదిదంపతులకు విశేష పూజలు జరిపారు. అనంతరం మేళతాళాలు, బాజాభజంత్రీలు, నేలవేషాలు, సాముగరిడీలు, తప్పెటగుళతో పురవీధులగుండా ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే ధర్మశ్రీతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.